క్లుప్తంగా

చలో ఢిల్లీని విజయవంతం చేద్దాం

డీవైఎఫ్‌ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

సంగారెడ్డి: జూలై 19న న్యూఢిల్లీ హెచ్‌కెఎస్ సుర్జీత్ భవన్ వద్ద నిర్వహించనున్న అఖిల భారత నిరుద్యోగ సదస్సును విజయవంతం చేయాలని డీవైఎఫ్‌ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల మాటను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరిస్తూ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలతో యువతకు శాశ్వత ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తోందని మండిపడ్డారు. సభకు యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు ఎం శ్రీకాంత్, సాయి, ప్రశాంత్, శ్రీకాంత్, హరినాథ్ రెడ్డి, శివ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



కాలనీలను సందర్శించిన సీపీఎం నాయకులు

సంగారెడ్డి టౌన్: డబుల్ బెడ్రూం కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని ఫసల్వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ డ్రైనేజీ నిండిపోవడంతో మురికి నీళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధిలైట్లను సరి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, అలీ, లక్ష్మణ్, యాదయ్య, జావీద్ పాల్గొన్నారు .

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన నిర్మలారెడ్డి

సంగారెడ్డి: పట్టణంలోని 9వ వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్లు బురదమయంగా మారడంతో సీసీ రోడ్డును వేస్తున్నట్లు పేర్కొన్నారు. దశలవారీగా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టడమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శితో బాజీ అనంతకిషన్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, శంకర్, రాజు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు



గేట్‌వాల్ నుంచి నీరు వృథా

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని మీని స్టేడియం సమీపంలో మిషన్ భగీరథ గేట్‌వాల్ నుంచి నీరు వృథాగా పోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం భారీగా నీరు వృథాగా పోవడాన్ని గ్రామస్తులు చూసి మొబైల్ ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గేట్‌వాల్ మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని మొలంగ్‌షా దర్గాలో ముస్లింలు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం దర్గా ఆవరణలో ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేశారు. దర్గాలో గంధం, పూల చదర్‌ను కప్పి ప్రార్థనలు చేశారు. మతపెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా బోనాల సంబరాలు

జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఆషాఢమాసం బోనాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు ఊరేగింపు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంటలు బాగా పండాలని మొక్కున్నారు. అలాగే, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



నారాయణఖేడ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సంగారెడ్డి: బోనాలతో వస్తున్న మహిళలు



నారాయణఖేడ్: అమ్మవారికి బోనం సమర్పిస్తున్న అనుపమారెడ్డి



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలలో బోనమెత్తిన ఆడపడుచులు



జోగిపేట(అందోల్): బోనాలతో ఊరేగింపుగా తరలిన మహిళలు



సదాశివపేట పట్టణంలో బోనాల ఊరేగింపు



జహీరాబాద్ టౌన్: బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే మాణిక్‌రావు,శివకుమార్ తదితరులు



సదాశివపేట: బోనాల ఊరేగింపులో పాల్గొన్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

రింగ్ రోడ్లతో నారాయణఖేడ్ అభివృద్ధి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నూతన లింక్‌రోడ్లు, బైపాస్ రోడ్లతో పట్టణం విస్తరించడంతో పాటు అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ పట్టణం చుట్టూ లింకురోడ్లుగా నిర్మిస్తున్న రింగురోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణం చుట్టూ రింగు రోడ్డు నిర్మిస్తుండగా.. పట్టణానికి కొంత దూరంలోని గ్రామాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లను సీసీతో విస్తరణ, రోడ్డుకు ఇరుపక్కలా విశాలమైన మురుగు కాల్వలు, డివైడర్ల కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు దూరమై, వ్యాపార, వాణిజ్య అవకాశాలు పెరిగి పట్టణ రూపురేఖలే మారిపోతాయన్నారు. రింగ్, ఔటర్ రింగ్ రోడ్ల కారణంగా పట్టణం 5 నుంచి 8కిలోమీటర్ల మేర విస్తరణ జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు అవుటి శంకర్, తౌసిఫ్ ఉన్నారు.



లింకురోడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్ల పనులపై ప్రత్యేక దృష్టి

కల్హేర్(నారాయణఖేడ్): నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి వద్ద కొత్తగా రోడ్డు నిర్మాణం పనులు, అంతర్‌గాంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలం పరిశీలించారు. గోసాయిపల్లికి రోడ్డులేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఏళ్ల తరబడిగా ఉన్న కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. కరెంట్ సరఫరాకు ఆటంకం లేకుండా ఉండేందుకు కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పా రు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవి పాటీల్, మల్హారి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జయరాజ్, శ్రీనివాస్‌రావు, విఠల్ పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం

బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ప్రభుగౌడ్

సంగారెడ్డి: బీసీ రిజర్వేషన్లు పెంపుపై అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రభుగౌడ్ మాట్లాడుతూ.. బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 2018 పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభు త్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఆందోళన కార్యక్రమాలను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పటోళ్ల మల్లికార్జున్ పాటిల్, జిల్లా ముఖ్య సలహాదారులు చంద్రయ్యస్వామి, జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు,



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుగౌడ్

హామీల అమలు పట్టని కాంగ్రెస్

టీజీటీపీసీ మాజీ ఛైర్మన్ మఠం భిక్షపతి

వట్‌పల్లి(అందోల్): స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని ఆర్డినెన్స్ పేరుతో మరోసారి బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి ఆరోపించారు. ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బీసీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్ 18 నెలలు గడుస్తున్నా హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసే సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ సైతం బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చిందని ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపామని చెప్పిన రేవంత్ సర్కార్ మళ్లీ ఆర్డినెన్స్ ఇవ్వడంలో మతలబేంటని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్ రెడ్డి మభ్యపెడుతున్నారన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే రాజకీయ రిజర్వేషన్లతో పాటు ఉద్యోగ నియామకాలు, ఉన్నత విద్య సీట్ల భర్తీలో సైతం 42% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు శివాజీరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీటీపీసీ మాజీ చైర్మన్ భిక్షపతి

రక్తదానంతో ప్రాణదానం

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు కోరారు. కోహీర్‌లోని ఇండియన్ స్కూల్ నిర్వాహకులు ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ.. అన్నీ దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ముందుకురావాలన్నారు. రక్తదానం చేసిన వారికి పండ్ల రసం, సర్టిఫికెట్లను అందజేశారు.



పండ్ల రసం ఇస్తున్న ఎమ్మెల్యే

నూతన కాలనీలకు 'మిషన్ భగీరథ'

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నవ్యకాలనీలో నల్లా కనెక్షన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అమీన్‌పూర్ అంటేనే మంచినీటి కొరతకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. దశాబ్ద కాలంగా ప్రణాళికబద్ధంగా నూతన రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే బంధం కొమ్ము రిజర్వాయర్ సైతం ప్రారంభిస్తామని చెప్పారు. మంచినీటి కొరత రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



నల్లా కనెక్షన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

నూతన కల్వర్టు ప్రారంభం

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మరనాత హీలింగ్ టెంపుల్ చర్చి సమీపంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన కల్వర్టును ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరి మతాన్ని గౌరవిస్తూ.. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, చర్చి నిర్వాహకులు భాస్కరరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో దివ్యాంగులతో సమావేశం

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలోని దివ్యాంగులతో అతి త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం రాత్రి నియోజకవర్గంలోని పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. దివ్యాంగులందరినీ సొంత కుటుంబ సభ్యుల వలే కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. గతంలో నియోజకవర్గంలోని 450 మంది దివ్యాంగులకు ఐదు కోట్ల రూపాయల సొంత నిధులతో ద్విచక్ర వాహనాలను అందించానని గుర్తు చేశారు. స్పందించిన దివ్యాంగులు ఆ ద్విచక్ర వాహనాలతోనే క్యాంపు కార్యాలయం వరకు వచ్చామని ఎమ్మెల్యేతో అన్నారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జహీరాబాద్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



హత్నూర (సంగారెడ్డి): పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: 21 సంవత్సరాల తరువాత స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు సంబరపడిపోయారు. పట్టణంలోని అల్లీపూర్ ఎంఆర్‌హెచ్‌ఎస్ హైస్కూల్ 2003–04 సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం బ్యాక్ టూ పేరుతో పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరిని ఒకరు అప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా సందడిగా గడిపారు. వేడుక నిర్వహించిన పూర్వ విద్యార్థులను గురువులు అభినందించారు.

మిత్రులను కలవడం ఆనందం ఉంది..

హత్నూర (సంగారెడ్డి): వారంతా 38 సంవత్సరాల క్రితం నరసాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కలుసుకున్నారు. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1986–87 విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు అప్పటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. పాత మిత్రులందరు కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గురువులతో కలిసి విద్యార్థులు సహాబంతి భోజనం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ విద్యార్థికి శ్రీబాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.33వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బలరాం మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణానికి చెందిన నందకిషోర్ రెడ్డి ఇంజనీరింగ్ చదువుకుంటూ ఖర్చుల కోసం రాపిడో బైక్ నడుపుకుంటున్నాడని తెలిపారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరగడంతో చికిత్స నిమిత్తం రూ.10లక్షలు ఖర్చు అయ్యాయని చెప్పారు. తమ బాధ్యతగా రూ.33 వేల నగదు, సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో అనిల్, రవి, లడ్డు, ప్రమోద్ , భరత్, అఖిల్, ఆదర్శ్ పాల్గొన్నారు.

◆ నేడు చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: మహిళా శక్తి సంబురాల్లో భాగంగా నేడు సోమవారం ఖేడ్‌లోని మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు ఇందిరాక్రాంతి ఏపీఎం వంశీ కృష్ణ తెలిపారు. ఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో మ.12 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు.

◆ క్రీడా సామగ్రి పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీలోని క్రీడాకారులకు స్ట్రైకర్ క్రికెట్ బృందాలకు రెండు క్రికెట్ కిట్లు, ఆట వస్తువులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చెడువ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై అసక్తి చూపాలన్నారు. యువకుల చైతన్యానికి సీజీఆర్ ట్రస్ట్ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

◆ అపర్ణపాటిల్‌కు సన్మానం

సదాశివపేట(సంగారెడ్డి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్ దంపతులను ఆదివారం వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్, ఎడ్ల బజార్ వీరశైవ సమాజం అధ్యక్షుడు రాజు, సమాజం సభ్యులు మల్లికార్జున్, రామకృష్ణ, శివరాజ్, చంద్రకళ, భరతప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీసమేతంగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, గ్రామస్తులు బాల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉప్పరి అంజయ్య, ఉప్పరి మోహన్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

◆ నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ని లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

◆ ప్రత్యేక తరగతులు

నారాయణఖేడ్: ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సులేఖనం పేరిట రైటింగ్ స్కిల్స్ నేర్చుకునేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు తెలుగుకు సంబంధించి అందమైన రాతను రాయడంలో అవసరమైన మెలకువల గురించి విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు.

◆ ఎంపీకి ఆహ్వానం

నారాయణఖేడ్: రాష్ట్ర దీప దూప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కాచిగూడ శ్రీతుల్జా భవన్ ధర్మశాలలో సోమవారం నుంచి 16వ తేదీ వరకు పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం నిర్వహిస్తున్నారు. యాగ కార్యక్రమానికి రావాలని ఆహ్వానపత్రికను ఆదివారం అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడపతి సంగయ్య స్వామి, ఆయా మండలా కన్వీనర్లు సిద్దయ్యస్వామి, ఖేడ్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఆయన స్వగృహంలో కలిసి అందజేశారు.

బీసీల ఓట్ల కోసమే రిజర్వేషన్ల నాటకం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

జోగిపేట(అందోల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు అంటూ నాటకాలు ఆడుతుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్స్ తేవడానికి వీలు లేదని భారత రాజ్యాంగంలో ఉందన్నారు. కామారెడ్డిలో బీసీల డిక్లరేషన్ బీసీ సబ్‌ప్లాన్, 50 శాతం కాంట్రాక్టులు ఇస్తామన్న మీరు ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. బీసీలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, వీరప్ప, నాయకులు సాయికుమార్, లింగన్న, నాగభూషణం, హెచ్.రామగౌడ్, సి.వెంకటేషా, శశికుమార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న క్రాంతి కిరణ్

బీజేపీ బలోపేతానికి కృషి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ సంగారెడ్డి పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం బూత్ కమిటీలను నియమించాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రజల పక్షాన పోరాటం చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండ కొడుతూ గత బీఆర్‌ఎస్ పాలన అరాచకాలను ప్రజల్లో పెద్ద ఎత్తున తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్, విజయ్‌కుమార్, వాసు, ద్వారక రవి, డాక్టర్ రాజుగౌడ్ , శ్రీపతిరావు, విట్టల్ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400